క్లుప్తంగా

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం



దాత నవీన్‌కు విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న ఆలయ ఏఈఓ నటరాజారావు

ద్వారకాతిరుమల : శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఏలూరుకు చెందిన గంధం నవీన్ ఆదివారం రూ. 1,16,000 విరాళంగా అందజేశారు. ముందుగా ఆయన కుటుంబ సభ్యులతో కలసి స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమచేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ ఏఈఓ పి.నటరాజారావు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

ప్రమాదాల నివారణకు స్పెషల్ డ్రైవ్



లక్కవరంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించిన ఎస్సై ఉమా మహేశ్వరరావు

జంగారెడ్డిగూడెం రూరల్ : రహదారి ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై లక్కవరంలో ఎస్సై ఉమా మహేశ్వరరావు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. వాహనాలు నడుపుతున్న మైనర్లకు ఎస్సై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించే వారు సీటు బెల్ట్ ధరించాలన్నారు. అతివేగం ప్రమాదాలకు కారణమన్నారు. సురక్షితమైన ప్రయాణాలు చేసి గమ్యస్థానాలకు చేరుకోవాలన్నారు.

ఎంపీ శ్రీధర్‌బాబు పరామర్శ



శ్రీనివాస్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎంపీ శ్రీధర్‌బాబు

కామవరపుకోట : తడికలపూడి గ్రామ సర్పంచ్ కొత్తపల్లి శ్రీనివాస్ కుటుంబ సభ్యులను ఎంపీ కోటగిరి శ్రీధర్ బాబు ఆదివారం పరామర్శించారు. శ్రీనివాస్ తండ్రి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. శ్రీనివాస్ కుటుంబ సభ్యులను ఎంపీ శ్రీధర్ పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆ కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని, ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని సదుపాయాలు త్వరగా అందే విధంగా చర్య తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి ఏఎంసీ మాజీ చైర్మన్ మేడవరపు అశోక్ శ్రీనివాస్, జెడ్పీటీసీ కడిమి రమేష్, ఎంపీటీసీలు గంగుల కడియాలు, కొప్పర్తి లక్ష్మి, నాగేంద్ర, శ్రీను, వైఎస్సార్ సీపీ శ్రేణులు, అభిమానులు పాల్గొన్నారు.

మైనర్లకు మోటారు సైకిళ్లు ఇస్తే తల్లిదండ్రులపై చర్యలు

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలో మైనర్లకు మోటారు సైకిళ్లు ఇస్తే వారి తల్లిదండ్రులపై చర్యలు తీసుకుంటామని, డ్రైవింగ్ లైసెన్సు లేకుండా వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని ఏలూరు ఎస్పీ డీ.మేరి ప్రశాంతి హెచ్చరించారు. ఎస్పీ ఆదేశాలతో ఏలూరు నగరంలో వాహన తనిఖీలు చేపట్టారు. మైనర్లు వాహనాలు నడుపుతూ కనిపిస్తే వారికి, వారి తల్లిదండ్రులకు సైతం కౌన్సెలింగ్ ఇచ్చారు. చట్టం మేరకు నడుచుకోవాలని హెచ్చరించారు. ఏలూరు వన్‌టౌన్ ప్రాంతంలో వన్‌టౌన్ సీఐ బోణం ఆదిప్రసాద్ ఆధ్వర్యంలో ఎస్సైలు ఎస్.రామకృష్ణ, మదీన బాషా తమ సిబ్బందితో కలిసి స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. వాహనాలను తనిఖీ చేయడంతో పాటు డ్రైవింగ్ లైసెన్సులు లేనివారికి, ప్రధానంగా మైనర్లకు ప్రత్యేకంగా కౌన్సెలింగ్ నిర్వహించారు. ఏలూరు టూటౌన్ ప్రాంతంలో టూటౌన్ సీఐ పీ.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఆర్ఆర్‌పేట శ్రీనివాస థియేటర్, పత్తేబాద, తంగెళ్ళమూడి తదితర ప్రాంతాల్లో వాహన తనిఖీలు చేపట్టారు.

అలరించిన పౌరాణిక త్రిరత్నాలు

ఏలూరు (టూటౌన్): స్థానిక హిందూ యువజన సంఘం (వైఎంహెచ్‌శ్రీ)లో జైదేవీ కనక దుర్గ నాట్యమండలి ఏలూరు వారిచే ఆదివారం సాయంత్ర ప్రదర్శించిన పౌరాణిక త్రిరత్నాలు ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఎం.సత్యనారాయణ యాదవ్ బృదం ప్రదర్శించిన ఈ నాటకం అలరించింది. ప్రదర్శనలో భాగంగా ముందుగా శ్రీకృష్ణ రాయబారం, మయసభ సన్నివేశంలో దుర్యోధనునిగా టి.రంగారావు తన నటనతో ఆకట్టుకున్నారు. ముందుగా వైఎంహెచ్‌ఏ మేనేజ్ మెంట్ కమిటీ అధ్యక్షుడు యర్రా సోమలింగేశ్వరరావు మాట్లాడుతూ రంగస్థల కళాకారులను ప్రోత్సహించడంలో వైఎంహెచ్‌ఏ ముందుంటుందన్నారు. అసోసియేషన్ కార్యదర్శి కోటేశ్వరావు మాట్లాడుతూ కళా ప్రదర్శనలు ప్రోత్సహించేందుకు నామమాత్రపు రుసుంతో హాలు అందిస్తున్నామన్నారు. ఎగ్జిక్యూటివ్ కమిటీ అధ్యక్షుడు జవ్వాజి మోహన్ విఠల్, బంకా రామోహనరావు, కెబిరావు, దువ్వి హేమసుందర్, పిలగల కొండలరావు, పెదపాటి రామకృష్ణ, కేవీ సుబ్బారావు, కె.సాంబశివరావు, కె.రవికుమార్ అధిక సంఖ్యలో కళాకారులు, కళాభిమానులు పాల్గొన్నారు.

నేటినుంచి మోగనున్న బడిగంటలు

- సోమవారం నుంచి పాఠశాలల పునఃప్రారంభం
- తొలిరోజే జగనన్న విద్యా కానుక అందజేత
- వేసవి దృష్ట్యా ఒకపూటే తరగతులు

బుట్టాయగూడెం : నేటి నుంచి బడి గంట మోగనుంది. వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు సోమవారం పునఃప్రారంభం కానున్నాయి. అయితే ఎండల తీవ్రత ఎక్కువగా ఉండడంతో ఈనెల 17వ తేదీ వరకు ఒక పూటే తరగతులు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఉదయం 7:30 నుంచి 11:30 గంటల వరకూ పాఠశాలలు నిర్వహించేలా ఉపాధ్యాయులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆదివారం పాఠశాలల బడులు తెరిచి శుభ్రం చేశారు.

జగనన్న విద్యాకానుక పంపిణీకి సిద్ధం

పాఠశాలలు తెరచిన మొదటిరోజునే జగనన్న విద్యాకానుక అందించే విధంగా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీనితో ఎంఈఓలు స్టాక్ పాయింట్ నుంచి పుస్తకాలను పాఠశాలలకు తరలించి సిద్ధం చేశారు. మొదటి రోజునే విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేసే విధంగా ఏర్పాటు చేశారు. బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, వేలేరుపాడు, కుక్కునూరు మండలాల పరిధిలో మొత్తం 1,22,436 టెక్ట్స్ బుక్స్, 79,306 నోట్ బుక్స్, డిక్షనరీలు 1,885 ఇప్పటికే పంపిణీకి సిద్ధంగా ఉంచినట్లు అధికారులు చెప్పారు. బుట్టాయగూడెం మండలంలో మొత్తం 130 పాఠశాలలు ఉండగా వీటిలో 7 వేల మంది విద్యార్థులకు 53 వేల పాఠ్య పుస్తకాలు, 40 వేల నోట్ పుస్తకాలు, 1192 డిక్షనరీలు సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. అదేవిధంగా కుక్కునూరు మండలంలో 65 పాఠశాలలు ఉండగా వీటిలో 2500 మంది విద్యార్థులకు 17,850 నోట్ బుక్స్, 40 వేలు టెక్ట్స్ బుక్స్ సిద్ధంగా ఉంచినట్లు చెప్పారు. అలాగే జీలుగుమిల్లి మండలంలో 49 పాఠశాలలు ఉండగా 3596 మంది విద్యార్థులకు 29,436 టెక్ట్స్ బుక్స్, 21456 నోట్ బుక్స్, ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలు 415, ట్యుటోరియల్ డిక్షనరీలు 278, బెల్ట్‌లు 2811 సిద్ధంగా ఉంచినట్లు అధికారులు తెలిపారు. అయితే ప్రభుత్వం పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్ది విద్యార్థులకు మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయడంతో ప్రభుత్వ పాఠశాలల్లో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు.



విద్యార్థులకు పంపిణీ చేసేందుకు సిద్ధం చేసిన పాఠ్య పుస్తకాలు

పుస్తకాలు సిద్ధంగా ఉన్నాయి



నేటి నుంచి పాఠశాలలు ప్రారంభం కానున్నాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉదయం 7:30 నుంచి 11 గంటల వరకూ బడులు నిర్వహించబడతాయి. ఎండల కారణంగా విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయాన్ని తీసుకోవడం జరిగింది. పుస్తకాలు పంపిణీ చేసేందుకు అన్నీ సిద్ధంగా ఉంచాం.

– తెల్లం బాబూరావు, ఎంఈఓ, బుట్టాయగూడెం మండలం

ఉదయమే వచ్చేలా సమాచారం అందించాం



ఎండల తీవ్రత దృష్ట్యా పాఠశాలలను ఈనెల 17వరకు ఒకపూటే నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో ఉదయం 7 గంటలకే విద్యార్థులు పాఠశాలలకు వచ్చేలా తగు చర్యలు చేపట్టాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు సమాచారాన్ని తల్లిదండ్రులకు అందేలా చర్యలు తీసుకున్నాం. అలాగే పాఠశాలల్లో తాగునీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నాం.

– కూరం శ్రీనివాసరావు, ఎంఈఓ, జీలుగుమిల్లి మండలం

దౌర్జన్యంపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం : తమ స్థలంలోకి అక్రమంగా ప్రవేశించి ఒక వ్యక్తి దాడి చేసినట్లు మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. పేరంపేటకు చెందిన చిలపరెడ్డి యామిని సరస్వతి భర్తకు 5 సెంట్ల ఇంటి స్థలం దస్తావేజు ద్వారా సంక్రమించింది. ఆ స్థలంలో ఇంటిని నిర్మించుకునే క్రమంలో ఈ నెల 7వ తేదీన యామిని సరస్వతి, బంధువులు స్థలాన్ని బాగు చేసుకుంటున్నారు. అదే సమయంలో చిలపరెడ్డి ప్రసాదరెడ్డి, మరో ఇద్దరు కలిసి స్థలంలోకి ప్రవేశించి బాగు చేయడానికి వీలు లేదంటూ దౌర్జన్యం చేయడంతో పాటు, కొట్టి గాయపర్చాడు. బాధితులు జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని, యామిని సరస్వతి ఫిర్యాదుతో కేసు నమోదుచేసినట్లు ఎస్సై తెలిపారు.

జూదరుల అరెస్ట్

జంగారెడ్డిగూడెం : పేకాట స్థావరంపై ఆదివారం దాడి చేసినట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు తాడువాయి గ్రామంలో దాడి చేసి పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ. 2,100 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

ఇంటింటా సంక్షేమ లబ్ధి

- చింతలపూడి ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా
- కొత్తూరులో గడపగడపకు మన ప్రభుత్వం

కామవరపుకోట : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించి రాష్ట్ర ప్రజలకు అండగా నిలుస్తున్నారని చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. కామవరపుకోట మండలం కొత్తూరు గ్రామంలో శనివారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు వివరించారు. గ్రామానికి చెందిన దివ్యాంగుడు నల్లమిల్లి సత్యం నడవలేని స్థితిలో ఉన్నానని తమకి బ్యాటరీతో నడిచే త్రిచక్ర వాహనం ఇప్పించాలని ఎమ్మెల్యే ఎలీజా దృష్టికి తీసుకెళ్లగా ఆయన వెంటనే స్పందించి త్వరలో వాహనాన్ని అందించే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత టీడీపీ పాలనలో హామీలు ఇచ్చి నెరవేర్చకుండా రాష్ట్ర ప్రజలను మోసం చేశారన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నూరు శాతం నెరవేర్చారన్నారు. రాష్ట్రంలో మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఉద్దేశంతో డ్వాక్రా సంఘాల ద్వారా సున్న వడ్డీ, స్త్రీ నిధి, ఆసరా పథకాలు ఇచ్చి అక్కా చెల్లెళ్లకు అండగా నిలిచారన్నారు. అలాగే ప్రతి పేదవాడు ఉన్నత చదువులు చదవాలనే ఉద్దేశంతో నాడు–నేడుతో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను మౌలిక వసతులతో తీర్చిదిద్ది, అమ్మ ఒడి, వసతి దీవెన, విద్యా దీవెన పథకాలు అందించి విద్యార్థులకు మేనమామగా నిలిచారని అన్నారు. గడపగడపకు కార్యక్రమానికి వెళుతుంటే ప్రజలు నిరాజనాలు పలుకుతున్నారని, వచ్చే ఎన్నికల్లో కూడా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్లు మిడతా రమేష్ బాబు, నానాది సాగర్, కామవరపుకోట సర్పంచ్ కరిపోతు అనూష, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పండు జగదీష్, డాక్టర్ రామకృష్ణ, ఎంపీటీసీ పోలిమెట్ల ప్రశాంత్, కో–ఆప్షన్ సభ్యులు ఎస్‌కే కరీముల్లా, వైఎస్సార్ సీపీ నాయకులు వి.శ్రీను, షేక్ మీరా సాహెబ్, బోట్ల లక్ష్మణ్, నల్లూరు ప్రభాకర్‌రావు, చిలుకూరు సుబ్బారావు, యర్నంశెట్టి భాపయ్య, చింతపల్లి సుధా, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల లబ్ధి బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా

రైస్ మిల్లు కార్మికులకు వేతనాలు పెంచాలి

జంగారెడ్డిగూడెం : రైస్ మిల్లు కార్మికులకు వేతనాలు పెంచాలని ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ డిమాండ్ చేశారు. ఆదివారం ధర్మన్న స్మారక భవనంలో ఐఎఫ్‌టీయూ పట్టణ కమిటీ విస్తృత స్థాయి సమావేశం మంచిలి రాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీ రమణ మాట్లాడుతూ జంగారెడ్డిగూడెం ఏరియాలో నాలుగున్నర ఏళ్ల క్రితం రైస్ మిల్లు కార్మికులకు అగ్రిమెంట్ జరిగిందని, రెండున్నర ఏళ్ల క్రితం జరగాల్సిన అగ్రిమెంట్ కరోనా వలన నిలిచిపోయిందన్నారు. రేట్లు పెంచాలని కార్మిక సంఘం డిమాండ్ నోటీసు ఇచ్చినా రైస్ మిల్లు యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని అన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో కార్మికుల బతుకులు దుర్భరంగా మారాయన్నారు. హమాలీలకు, డ్రైవర్లకు 15 రోజులలో వేతనాలు పెంచకపోతే సమ్మె చేసేందుకు కార్మికులు సిద్ధంగా ఉండాలన్నారు. ఈ సమ్మెకు పట్టణంలో కార్మిక వర్గం సహకరించాలని సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. ఈ సమావేశంలో తమ్మా సోమలింగ మల్లికార్జున, మాల్చి కొండయ్య, శ్యామలరావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కేవీ రమణ

సినీ నటుడు సుమన్‌కు ఆహ్వానం

కొయ్యలగూడెం : త్వరలో నిర్వహించబోయే గౌడ గర్జన మహాసభకు హాజరుకావాలని సినీ నటుడు సుమన్‌ని ఆహ్వానించినట్లు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, రాష్ట్ర గౌడ్ సంఘం సభ్యులు కాశగాని గోఖలే పేర్కొన్నారు. జంగారెడ్డిగూడెం విచ్చేసిన సుమన్‌ను ఆదివారం రాష్ట్ర గౌడ సంఘం నాయకులతో కలిసి మర్యాదపూర్వకంగా కలిసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా సుమన్‌ను శాలువాతో సత్కరించామన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర గౌడ గర్జన మహాసభకు నిర్ణయించే తేదీపై ఈ నెల 25న జంగారెడ్డిగూడెంలో ముఖ్య నాయకులతో కలిసి సమావేశం ఏర్పాటు చేశామని తెలిపారు. రాష్ట్ర గౌడ గర్జన కార్యక్రమానికి సుమన్ తప్పనిసరిగా హాజరవుతానని అన్నారని, అలాగే కర్ణాటక, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన ప్రముఖులను ఆహ్వానించినట్లు తెలిపారు.



సినీ నటుడు సుమన్‌ని సత్కరిస్తున్న గౌడ సంఘం నాయకులు

ముగిసిన వేసవి శిక్షణ తరగతులు



చింతలపూడి : శాఖా గ్రంథాలయంలో బహుమతులు అందుకున్న విద్యార్థులు



జంగారెడ్డిగూడెం రూరల్ : లక్కవరంలో ప్రశంసా పత్రాలను అందుకున్న విద్యార్థులు



జంగారెడ్డిగూడెం: విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేసిన దృశ్యం



ద్వారకాతిరుమల : విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేస్తున్న ఉప సర్పంచ్ సావిత్రి

చింతలపూడి : గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా తరగతులు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా చింతలపూడి శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు మిరియాల దిలీప్ గ్రంథాలయాల విశిష్టతను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు సెల్ ఫోన్‌కు దూరంగా ఉండి ఎక్కువగా పుస్తకాలు చదవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పట్టణ వైఎస్సార్ సీపీ కన్వీనర్ కొప్పుల నాగేశ్వరరావు, సచివాలయాల మండల కన్వీనర్ త్సల్లాబత్తుల శ్రీనివాసరావు, పట్టణ సచివాలయాల కన్వీనర్ ఎస్ దుర్గారావు, గ్రంథాలయాధికారి ఎస్.వర్మ తదితరులు పాల్గొన్నారు.

లక్కవరంలో...

జంగారెడ్డిగూడెం రూరల్ : లక్కవరం శాఖా గ్రంథాయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం ఆదివారంతో ముగిసింది. 35 రోజుల పాటు అనేక విజ్ఞాన పరమైన అంశాలపై విద్యార్థులకు శిక్షణ, పోటీలు నిర్వహించినట్లు గ్రంథాలయాధికారి ఎం.రియాజ్ తెలిపారు. విజేతలకు ప్రశంసా పత్రాలను, బహుమతులను గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ఎ.నాగేంద్రకుమార్, గ్రంథాలయాధికారి రియాజ్ చేతుల మీదుగా అందజేశారు.

జంగారెడ్డిగూడెం : స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా తరగతులు ముగిశాయి. ఆదివారం గ్రంథాలయంలో ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి పులి దుర్గారావు మాట్లాడుతూ వేసవి నేపథ్యంలో విద్యార్థులకు ఆటవిడుపుతో పాటు విజ్ఞానాన్ని అందించే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు మే 8 నుంచి జూన్ 11వ తేదీ వరకు వేసవి శిక్షణా తరగతులు నిర్వహించినట్లు చెప్పారు. ఈ శిక్షణా తరగతుల్లో వ్యాసరచన పోటీలు, వక్తృత్వం, చిత్రలేఖనం, పాటలు, చెస్‌పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. జూనియర్స్, సీనియర్స్ విభాగంలో నిర్వహించిన పోటీల్లో విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు, పాల్గొన్నవారందరికీ ప్రశంసా పత్రాలు అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎండీ ఉమర్‌ఆలీ, మంగరాజు మాస్టారు, చందు, ఎండీ హీమరా, సిబ్బంది శిరీషా తదితరులు పాల్గొన్నారు.

సాంకేతికతను విజ్ఞానానికి వినియోగిద్దాం

కొయ్యలగూడెం : సాంకేతికతను విజ్ఞానం వైపు దిశగా వినియోగించుకుంటే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, అదే సాంకేతికతను పెడదోవకు ఉపయోగించుకుంటే భవిష్యత్తు అంధకారం అవుతుందని సెల్‌ఫోన్‌ల వినియోగాన్ని ఉద్దేశిస్తూ వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పోతన తాతారావు పేర్కొన్నారు. ఆదివారం కొయ్యలగూడెం శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా తాతారావు, ప్రత్యేక అతిథిగా బలుసు నాగేశ్వరరావు హాజరయ్యారు. గ్రంథాలయాలను విద్యార్థులు వినియోగించుకుని విద్యలో రాణించాలన్నారు. అనంతరం లైబ్రేరియన్ యు.రాముడు ఆధ్వర్యంలో ప్రభుత్వం తరపున విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. అలాగే స్వర్గీయ గంగిరెడ్ల శ్రీనివాసరావు జ్ఞాపకార్థం రూ.15 వేల విలువైన ప్రోత్సాహక బహుమతులను 40 మంది విద్యార్థులకు పంపిణీ చేశారు. లైబ్రరీలో స్వాతంత్ర సమరయోధుల చిత్రపటాల ఏర్పాటుకు కృషి చేస్తానని రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు ఎస్‌బీజీ శేఖర్ తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ మేకల అన్నవరం, ఉపాధ్యాయులు అనిపెద్ది రాధాకృష్ణ, శివ, ఏవీఆర్ఎం రమణ, రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు ఎస్‌బీజీ శేఖర్, గెద్దా మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

టి.నరసాపురం : స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి ఆర్.కిషోర్ అధ్యక్షతన ముగింపు సమావేశం నిర్వహించారు. అరసం రాష్ట్ర కార్యదర్శి బీఎస్ సాగర్ మాట్లాడుతూ విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వం, పద్యపఠనం, దేశభక్తి గేయాలు, చదరంగం, కేరమ్స్, ఇండోర్ క్రీడా పోటీలు నిర్వహించినట్లు వివరించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఎస్సై కె.సతీష్‌కుమార్ విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలు, పలు ఆరోగ్య సూచనలు, పుస్తక పఠనం వల్ల కలిగే ఉపయోగాలను తెలియజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎం.సునంద, విజన్ స్కూల్ కరస్పాండెంట్ పి.శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

ద్వారకాతిరుమల : స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరం ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో పంచాయతీ ఉప సర్పంచ్ బొండాడ సావిత్రి, తెలంగాణ రాష్ట్రంలోని హుజూర్‌నగర్ గ్రంథాలయ అధికారి గుర్రం నాగరాజు ముఖ్య అతిథులుగా పాల్గొని, విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ సావిత్రి మాట్లాడుతూ వేసవి సెలవుల్లో పుస్తక పఠనం ద్వారా విద్యార్థులకు విజ్ఞానాన్ని అందించేందుకు ఈ శిక్షణా శిబిరాలను నిర్వహించడం శుభపరిణామమని అన్నారు. ఈ సందర్భంగా స్థానిక గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యి, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం పొందిన బి.దుర్గ శ్రీవల్లిని గ్రంథాలయ అధికారి బంగారు పాప ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకురాలు బట్టు మణి, భారతి, మౌనిక పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

టి.నరసాపురం : చికిత్స పొందుతూ యువకుడు మృతిచెందినట్లు ఎస్సై కె.సతీష్‌కుమార్ తెలిపారు. వివరాల ప్రకారం వెంకటాపురం గ్రామానికి చెందిన దోమతోటి రాహుల్ (19) టి.నరసాపురంలో మోటార్ సైకిల్ మెకానిక్ పని నేర్చుకుంటున్నాడు. ఈ క్రమంలో తండ్రి శ్రీనును మోటార్ సైకిల్ కొనివ్వమని అడిగాడు. ఆర్థిక పరిస్థితి బాగాలేదని, తరువాత కొనిస్తానని తండ్రి చెప్పడంతో మనస్తాపం చెందిన రాహుల్ ఈ నెల 7వ తేదీన కలుపు మందు తాగాడు. తరువాత విషయాన్ని తండ్రికి చెప్పడంతో వెంటనే రాహుల్‌ను ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మధ్యాహ్నం మృతి చెందాడు. ఆసుపత్రి నుంచి సమాచారం, తండ్రి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విభజన చట్టంలోని హామీలు అమలు చేయాలి



ఏలూరు పాతబస్టాండ్ సెంటర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న వామపక్ష పార్టీలు

ఏలూరు (టూటౌన్): ఆంధ్రప్రదేశ్‌కు ద్రోహం చేసిన బీజేపీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా విశాఖ పర్యటనను నిరసిస్తూ ఏలూరులో వామపక్ష పార్టీలు నిరసన వ్యక్తం చేశాయి. స్థానిక పాతబస్టాండ్ సెంటర్‌లో ఆదివారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డేగా ప్రభాకర్, సీపీఎం జిల్లా కార్యదర్శి ఏ.రవి, సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు బద్ద వెంకట్రావు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఇచ్చిన ప్రత్యేక హోదా, విభజన చట్టంలోని హామీలు అమలు చేయకుండా ద్రోహం చేసిందన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటు కంపెనీలకు అప్పగించేందుకు ప్రయత్నిస్తోందన్నారు. కేంద్ర మంత్రులు రాష్ట్రంలో తిరిగే నైతిక అర్హత కోల్పోయారన్నారు. దేశ ప్రజల మధ్య ప్రాంతీయ, మత బేధాలు సృష్టించి ఘర్షణలకు బీజేపీ ఆజ్యం పోస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం ఏలూరు కార్యదర్శి పి.కిషోర్, సీపీఐ ఏలూరు కార్యదర్శి ఉప్పులూరి హేమశంకర్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో నాయకులు కె.శ్రీనివాస్, పీవీ రామకృష్ణ, వి.సాయిబాబు, వీవీఎస్ ప్రసాద్, జె.గోపి, ఎస్ సత్యనారయణ, కె.కృష్ణమాచార్యులు, కుర్రెళ్ల వరప్రసాద్, అడ్డగర్ల లక్ష్మి, ఎంఏ హకీమ్, తెర్లాపు శ్రీను, ఉప్పులూరి రవి, ఎం.అప్పారావు, జి.నాగేశ్వరరావు, సీహెచ్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఉంగుటూరులో ఉచిత ఇన్సులిన్ క్యాంపు

ఉంగుటూరు: ఉంగుటూరులో స్వర్గీయ డా.పాతూరి శివన్నారాయణ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత ఇన్సులిన్ మెడికల్ శిబిరం నిర్వహించారు. ఆదివారం నిర్వహించిన ఈ శిబిరానికి 18 ఏళ్ల లోపు పిల్లలు మూడు జిల్లాలకు చెందిన 80 మంది, పెద్దవాళ్లు 25 మంది హాజరయ్యారు. ఆలిండియా డయాబెటీస్ సొసైటీ అధ్యక్షుడు డా.పీవీ రావు స్వయంగా ఈ శిబిరంలో సేవలు అందించారు. ఈ శిబిరానికి హాజరైన రోగులను అమెరికా నుంచి తెప్పించిన యంత్రంతో పరీక్షించారు. మూడునెలలకు సరిపోయే ఇన్సులిన్ మందును , ప్రొటీన్ పౌడర్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఎక్స్ కంపెనీ ఉచితంగా హెల్త్ డ్రింకు పంపిణీ చేసింది. వచ్చిన వారందరికీ ఉచితంగా భోజన సదుపాయం కల్పించారు. ట్రస్టు నిర్వాహకులు పూతూరి వంశీకృష్ణ, సహాయకులుగా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొండ్రెడ్డి సర్వేశ్వరరావు, పాతూరి విజయకుమార్ పాల్గొన్నారు. ఉచిత కంటి వైద్యశాల టెక్నీషియన్ మోహిని, ట్రస్టు ఉచిత వైద్యశాల టెక్నీషియన్ బండారు మెనిక ప్రసన్న హైదరాబాదు నుంచి వచ్చిన వైద్యులు, టెక్నీషియన్లు పాల్గొన్నారు.

ఐదుగురు ఉపాధి సిబ్బంది నియామకం

దెందులూరు: దెందులూరు మండలానికి ఐదుగురు నూతన సిబ్బంది నియమితులయ్యారని దెందులూరు ఎంపీడీఓ ఏబీపీవీ లక్ష్మి తెలిపారు. కే.మధుశేఖర్ టీఏ, ఏ.కిషోర్ టీఏ, పీ.రమేష్ టీఏ, వీ.సురేంద్ర సీఓ, బీ. విజయభాస్కర్‌రెడ్డి సీఓలు రేషనలైజేషన్‌లో భాగంగా కర్నూలు జిల్లా నుంచి బదిలీపై వచ్చారని వివరించారు. ఐదుగురు ఉద్యోగులు విధుల్లో చేరారన్నారు.